

# ఏది నిజం?

**శ్రీకంఠమూర్తి**

తెలుపు సందులోనుండి వచ్చిపడిన ఉత్తరం తీసి తాపీగా చదవనారంభించాను. రెండు వరుసలు చదివేటప్పటికి కళ్ళు చీకట్లు కమ్మి. పరిసరమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించసాగింది. ఒక్క నిముషం కళ్లు మూసుకుని. మనసు కాస్త కుదుటబరచుకుని మళ్ళీ చదివాను. అవును నిజమే! నాకళ్ళు నన్ను మోసం చేయడం లేదు.

"సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు చి. శంకరం మమ్మల్నందరినీ దుఃఖ సాగరంలో ముంచి వెళ్ళిపోయాడు. బ్లడ్ ప్రెషర్ వల్ల నెత్తురు కక్కుకుని మరణించాడని డాక్టర్లు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఎలావున్నా అంతా ఆ దైవేచ్ఛ.

— కేశవయ్య"

ఉత్తరం పూర్తిగా చదివి స్థంభించి

పోయాను. నా గుండె కొట్టుకోవడం నాకే వినిపించింది స్పష్టంగా. కాలూ చెయ్యీ ఆడక అలాగే కూర్చుండిపోయాను చాలా సేపు. ఏమిటి ఈదారుణం? ఇలా ఎలా జరిగింది? మెదడంతా మొద్దుబారిపోయి, చెవులు వినిపించడం మానేశాయి. శ్రీమతిని కేకేసి ఈ విషయం చెబుదామనుకున్నా నోట్లోంచి మాటే రావడంలేదు.

వంటింట్లో వుండి ఏదో ప్రశ్న అడిగిన శ్రీమతి జవాబే రాకపోయేసరికి గదిలోకి వచ్చింది. నోటి విషయం చెప్పలేని నేను ఉత్తరం ఆమెచేతికి అందించాను మౌనంగా.

అది చదివిన ఆమె కూడా అయోమయంగా చూస్తూండి పోయింది కాసేపు.తరువాత దుఃఖంతో బొంగురు పోయిన గొంతుతో ''ఏమిటండీ ఈ అన్యాయం? ఇలా ఎలా జరిగింది?'' అని నన్నే అడిగింది.

అది తెలిస్తే ఇంకేముంది? మానవ శక్తికి అప్పుడు ఎదురేవుండదు. ప్రపంచంలో హైబ్లడ్ ప్రెషర్ వస్తె ఇలా నెత్తురు కక్కుకుని మరణిస్తారని తెలుసుకాని అది ఇలాంటి వయసులో వున్న కుర్రాళ్ళకు వచ్చే జబ్బుకాదు, వయసు చెల్లిపోయి వృద్ధాప్యంలోకి అడుగు పెట్టిన వారికి వస్తుంది. శంకరం ఇంకా యువకుడు, అసలు ఇరవై ఏళ్లు కూడా నిండాయో లేదో? మరి ఈ మాయదారి రోగం అతనికెలా వచ్చింది? ఇలా అర్థాంతరంగా చచ్చిపోవడానికి కారణ మేమిటి? ...... తనిక్కడ, వాళ్ళక్కడ. ఎలా తెలుస్తుంది కారణం తనకు? ఒకవేళ ఇప్పుడు తెలిసినా ప్రయోజన మేముంది? అతనిప్పుడు ఈ లోకంలో లేకపోయిన తరువాత కారణాలు తెలుసుకున్నా ఒకటే, మానినా ఒకటే.

దొడ్లోకి వెళ్ళి నాలుగు చెంబుల నీళ్ళు నెత్తిన గుమ్మరించుకుని వచ్చి, పక్కమీద వాలిపోయాను.

శ్రీమతికూడా ఏడుస్తూ వెళ్ళి స్నానం చేసి వచ్చి మంచంమీద నా కాళ్ళ దగ్గర చతికిలబడింది. ''ఇంత దారుణం చేస్తాడా భగవంతుడు?'' అని మళ్ళీ ఏడవసాగింది.

దారుణం కాదు మరి! ఒక్కగా నొక్క కొడుకిలా అర్థాంతరంగా అకాలమృత్యువు పాలబడితే ఇహ ఆ తల్లి-దండ్రుల దుఃఖానికి అంతుంటుందా?

''ఛ...ఛ! ఇలాంటి పరిస్థితి పగవాళ్లకు కూడా వద్దు బాబూ!'' అంటూ కళ్లు



తుడుచుకుంది శ్రీమతి.

నేనేం మాట్లాడలేదు. అసలు మాట్లాడ బుద్ధి కావడం లేదు కూడా. ఎటు చూసినా శంకరం రూపమే కళ్ళలో మెదులుతోంది.

శంకరం మా అన్నయ్య కొడుకు. మా అన్నయ్య పెదనాన్న కొడుకైనా మేమిద్దరం స్వంత అన్నదమ్ముల లాగా వుంటాము. మా అన్నయ్యకు ముగ్గురు కూతుళ్ళ తరవాత పుట్టిన ముద్దుల కొడుకు శంకరం. అసలు వాళ్ళ అదృష్ట మెలాంటిదోగాని, పెద్దకూతురూ శంకరం తప్ప మధ్యలో ఆడపిల్లలిద్దరూ పెరిగి పెద్దవాళ్లయ్యాక హఠాత్తుగా చనిపోయారు. ఉన్నవాళ్ళిద్దరిలోనూ ఇప్పుడు ఒకడు పోతే ఆ కన్న హృదయాలు ఎలా తట్టుకుంటాయో? అను దేళ్ళ కోపు తల్లినీ, తండ్రినీ, ముగ్గురు పిల్లలనూ పోగొట్టుకున్న అన్నయ్య నిజంగా ఎంత దురదృష్టవంతుడు? ఇంట్లో వున్నవాళ్ళందరూ ఇలా ఒకరి వెంట ఒకరు నిష్క్రమిస్తుంటె ఆ భార్యాభర్తలు ఎంతవరకూ భరించగలరు? మృత్యుదేవత తాండవ మాడుతున్న ఆ ఇంట్లోమటుకు ఎలావుండగలరు? అన్నయ్య రోజులు ఎలా వెళ్ళదీస్తున్నాడో పాపం! ఏ ఆశతో జీవించాలతను? ఎవరికోసం, ఏం సాధించడంకోసం బ్రతకాలి? అంతటి దుఃఖంలో వున్న అతనికి నేను మాత్రం ఏమని సాంత్వన వచనాలు వ్రాయగలను? నేను వ్రాసినా అతనికి దుఃఖతప్తమయిన హృదయం ఊరడిల్లుతుందా?

మనసులో చీమలబారుల్లా వస్తున్న ఆలోచనలను పక్కకునెట్టి శ్రీమతిని ప్రశ్నించాను.

''ఉత్తరం ఏమని వ్రాయను సుశీ?''

''ఉత్తరం ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

''అన్నయ్యకిప్పుడు ఉత్తరం వ్రాయొద్దూ?''

''ఉత్తరం వ్రాస్తె ఏం బాగుంటుందండీ? మీరే ఓసారి వెళ్ళొస్తె బాగుంటుందిగాని.''

''వెళ్ళొస్తే బాగానే వుంటుంది. ఆ విషయం నాకూ తెలుసు. అసలు చచ్చిపోయింది అన్నయ్య కొడుకయినప్పుడు వెళ్ళక తప్పదుకూడా. కాని నేను వెళ్ళలేను. వెళ్ళి అన్నయ్యా- వదినల విచారవదనాలను చూడలేను.''

''అలా ఎలా కుదురుతుందండీ? మనను కాస్త కుదుటబరచుకుని వెళ్ళి వాళ్ళకు కొంచె ధైర్యం చెప్పి రావాలి. లేకపోతే వాళ్ళేమనుకుంటారు?'' అంది మళ్ళీ.

''ఏ మొహం పెట్టుకుని వెళ్లమంటావు? నేను వెళ్ళి ధైర్యం చెబితే మటుకు వాళ్ళ దుఃఖం తీరుతుందా? వాళ్లకన్న ఎక్కువగా నేనే బెంబేలు పడిపోతాను అక్కడికి వెళితే''

''మీరు చెప్పిందంతా నిజమేనండి ఎవరు వెళ్ళి ఏమీ చేయలేరు ఈ సమయంలో. నాకూ తెలుసు. కాని కష్టసమయంలో వచ్చి పరామర్శించలేదని నలుగురూ అనుకుంటారు. అందులోనూ అవూరినిండా మీ బంధువులే వున్నారాయె.''

సుశీల చెప్పింది కూడా నిజమే. వాళ్ళకు ఈ కష్టం రావడం కాదుగాని మధ్యలో నాకొచ్చిపడింది పెద్ద ఇబ్బంది. వెళ్లకపోతేనేమో బాగుండదు. వెళ్ళగలిగే ధైర్యం నాకులేదు. దీనికేమిటి ఉపాయం?

కాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. ముందు ఒక ఉత్తరం వ్రాసి పడెయ్యడం. తరువాత వీలు చూసుకుని ఒకసారి వెళ్ళిరావడం. ఈ పద్ధతి సుశీలకు కూడా నచ్చింది.

వెంటనే అన్నయ్యను ఓదారుస్తూ ఒక ఉత్తరం వ్రాశాను. ఆరోగ్యం బాగాలేక ఇప్పుడు రాలేనని అబద్ధం వ్రాశాను.

ఒక నెలరోజులు గడిచాయి. నాకూ మనసు కొంచెం స్థిమితపడింది. ఆఫీసుకు

రెండురోజులు సెలవుపెట్టి ఊరికి బయలు దేరాను.

శంకరంపోయి నెల దాటిపోయినా మా వూర్లో బస్సు దిగేటప్పుడు మనసంతా ఎలాగో అయిపోయింది. అంత దూరం వెళ్ళాక వెనక్కి రాలేం కదా? ఆవేదనను అణచుకుంటూ వీధిలో అడుగులు వేయసాగాను. ఊరికే ఒకసారి పలకరించి రావడమే తప్ప అక్కడ మకాం చేసే ఉద్దేశం లేదు కాబట్టి నా వెంట ఏమీ తీసుకెళ్ళలేదు. అయినా శరీరం బరువుగా అనిపించి నడవడమే కష్టమయిపోయింది.

ప్రయాసతో నడచి వెళ్ళి అన్నయ్య ఇంటి గుమ్మం దగ్గర ఆగాను. గుమ్మం దాటి లోపలకు వెళ్ళడానికి ఏదో తటపటాయింపు. ఈ ఘోరం జరక్కుండా వుంటే ఇంకో అయిదారేళ్ళల్లో ఆ గుమ్మం పచ్చని తోరణాలతో కళకళలాడేది. ఈ ఆవరణంతా పెళ్ళిపందిరితో శోభాయమానంగా వుండి, బంధువులతోనూ, మిత్రులతోనూ నిండిపోయేది. కాని అన్నయ్య అదృష్టానికి నోచుకోలేదు. పిల్లలకు తన చేతుల్తో పెళ్ళిళ్లూ పేరంటాలూ చేయవలసిన ఈడులో ఒక్కొక్కళ్ళకే వరసన అంత్యక్రియలు చేసే దౌర్భాగ్యం కలిగింది వాడికి.

జేబు రుమాలు తీసి మొహం తుడుచుకుని లోపల ప్రవేశించాను. సింహద్వారానికి యాభై గజాల దూరంలో వుంటుంది ఇల్లు.

అంతదూరమూ నా అడుగుల చప్పుడే నాకు వినిపిస్తోందిగాని ఇంట్లో నుండి ఏ సవ్వడీ వినరావడంలేదు. మెట్లెక్కి తలుపు దగ్గర నిలబడినా నిశ్శబ్దమే! అసలు ఇంట్లో మనుషులున్న జాడే కనిపించలేదు. ఇటూ అటూ వున్న అరుగులు ఖాళీగా బోసిగావున్నాయి. ఒక్క అరుగులే కాదు, ఇల్లంతా కూడా బోసిగా విధవరాలి మొహంలా కళాహీనమై లోపలకి అడుగు పెట్టడానికే భయం కొలిపేలావుంది.

ఇదివరకు నేనీ ఇంటికి ఎన్నిసార్లు రాలేదు? ఎప్పుడు వచ్చినా ఈ అరుగుల నిండా ఏవో ఆరబోసి వుండేవి. ఆడంగులందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ పప్పులు బాగుచేయడమో, లేక అప్పడాలో త్తడమో చేస్తూ వుండేవారు.

ఇంటికెవరైనా రాంగానే లేచి కాళ్లు కడుక్కునేందుకు చెంబుతో నీళ్లు తెచ్చి పెట్టేవారు, మంచినీళ్లిచ్చి కుశల ప్రశ్నలడిగేవారు.

ఈరోజు అవేమీ లేకపోగా ఇంట్లో వాళ్ళంతా ఎక్కడికో వెళ్లిపోయినట్టూ అతి నిశ్శబ్దంగా వుంది.

లోపలకు వెళ్ళాను. సావిట్లో ఒక పక్కగా చాపేసుకుని గోడ వైపు తిరిగిపడుకుని వున్నాడు అన్నయ్య. నా అడుగుల చప్పుడుకూడా అతన్ని లేపలేక పోయింది. ఇంతలో వదిన లోపలి నుండి వచ్చి కూర్చోవడానికి కొక జంబుకానా పరచి, నా వైపు చూడనైనా చూడకుండా అన్నయ్య దగ్గరకు వెళ్ళింది.



"ఏమండీ, మరిదిగారొచ్చారు లేవండీ" అంది,

అన్నయ్య లేచాడు. మోకాళ్ళచుట్టూ చేతులు బిగించి నా వైపు శూన్యదృష్టితో చూస్తూ మౌనంగా వుండిపోయాడు. అన్నయ్యనలా చూస్తుంటే నా కడుపు తరుక్కుపోయింది. నాకోసం పరచిన జంబుకానా మీద కూర్చోకుండా అన్నయ్య ప్రక్కనే చాపమీద కూర్చున్నాను. ఏం మాట్లాడాలో తెలియక ఎంతోసేపు మౌనంగా కూర్చుండిపోయాను.

ఒక్క నెలరోజుల్లో అన్నయ్య ఎంతో మారిపోయాడు. వేసవికాలంలో బావిలో నీళ్లు లోతుకుపోయాయి. బుగ్గలు లోపలికి పీక్కుపోయి, దవడ ఎముకలు బయటికి పొడుచుకు వచ్చాయి. జుట్టు సగానికి పైగా నెరసిపోయి. మొహం నిండా విచారరేఖలు దట్టంగాఅలుముకున్నాయి. మొత్తంమీద చెప్పాలంటె నలభై అయిదేళ్లు మించని అన్నయ్య ఒక్కసారిగా అరవై యేళ్లవాడిలాగా మారిపోయాడు ఈ నెల రోజుల్లో!

ఇంతలో వున్నట్టుండి ఇంట్లోంచి ఏడుపులు వినిపించడంతో కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. నాకు కూడా ఇరవైఏళ్ల శంకరం కళ్లముందు మెదిలినట్లయి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. తలవంచుకుని కళ్లు తుడుచుకుంటూండగా అన్నయ్య పెద్దకూతురు శకుంతల బయటికి వచ్చింది.

రాగానే నా ముందు కూలబడిపోయి "బాబాయ్...చూశారా మన శంకరం ఎంత అన్యాయం చేసిపోయాడో? ఆ భగవంతుడు ఇలా ఎందుకు చేశాడు బాబాయ్?" అంటూ భోరున విలపించసాగింది.

నేను మాత్రం ఏం చెప్పగలను? ఆమె తల నిమురుతూ అన్నయ్య వైపు చూశాను. వాడింకా అలాగే శూన్య దృక్కులతో చూస్తున్నాడు.

దుఃఖం కాస్త ఉపశమించాక శకుంతలే చెప్పనారంభించింది. "అసలు శంకరంఇలా అర్ధాంతరంగా పోతాడని ఎవరికీ తెలియదు బాబాయ్. ఆ రోజు రాత్రి నాన్నా వాడూ కలసి భోంచేసి అరుగు మీద కూర్చున్నారు. పక్కింటి రామనాథం బాబాయి కూడా వచ్చి కూర్చున్నారు. ముగ్గురూ కబుర్లలో పడి చాలాసేపు అక్కడే కూర్చుండిపోయారు. మాట్లాడుతూ మాట్లాడుతూనే శంకరం తనకేమిటోలా వుందన్నాడు. నేనూ నాన్నా ఎంత అడిగినా ఏమిటోలా అవుతోందన్నాడే తప్ప తన బాధని ఫలానా అని వివరంగా చెప్పలేకపోయాడు. గదిలో పక్కేసి మెల్లిగా తీసుకొచ్చి పడుకోబెట్టారు నాన్నా, ఆ బాబాయిగారూను. అయిదు నిముషాలన్నా అలా పడుకున్నాడో లేదో, వెంటనె లేచి కూర్చుని భళ్లున వాంతి చేసుకున్నాడు. అబ్బ! తల్చుకుంటె ఇప్పటికీ కళ్లు తిరుగుతాయి బాబాయ్. అంతా నెత్తురే కక్కుకున్నాడు వెంటనే ఇంట్లోవాళ్లమంతా పొగయి కాసిని మంచినీళ్లు తాగించి గాలి విసురుతూ కూర్చున్నాము, ఎవరో పరుగెత్తుకు వెళ్లి ఊళ్లో వున్న డాక్టర్ని పిల్చుకొచ్చారు. రాగానే తమ్ముడినాడి పరీక్షించిన డాక్టర్ తక్షణం టౌనుకు తీసుకెళ్లా

అని చెప్పి వెళ్ళిపోయాడు ..."

అప్పటికి నోరు పెగల్చగలిగిన నే ఆదుర్దాగా అడిగాను." మరి వెంట తీసుకెళ్ళలేదా?" అని.

గద్గద స్వరంతో మళ్ళీ చెప్పిం శకుంతల.

"తీసుకెళ్ళాం బాబాయ్. కరణం ద్వారా షావుకారుగారి కారడిగి, ఆ కా వెంటనే టౌనుకు తీసుకెళ్ళాం... ఒక రోజన్నా గడవకముందే ఇంటి ముందు పీనుగు వచ్చిపడింది. నాన్న స్పృహతప్పి పడిపోయాడు. అమ్మ పిచ్చి చూపులు చూస్తూ బిగుసుకుపోయి కూర్చుంది. మా అవస్థ అప్పుడెలా వుంటుందో ఊహించు బాబాయ్."

"మరి టౌనులో డాక్టర్లు వాణ్ని బ్ర కించడానికి ఏమీ ప్రయత్నం చేయలేదా"

"చేశారు, వాళ్ళ చేతనయినంతా చేశా గౌర్నమెంట్ హాస్పిటల్లో అయితే సరి చూడరేమోనన్న అనుమానం ప్రైవేట్ డాక్టరు దగ్గరికే తీసుకెళ్ళా. ఆయన పేరుమోసిన ఫారిన్ రిటర్న్ డాక్టరు, అయితేనేం? మన అదృష్ట బాగలేనప్పుడు ఆయన మాత్రం ఏం చేయ గలడు? చేయగలిగినంత ప్రయత్నం చే కూడా తమ్ముణ్ని దక్కించుకోలేపోయాం, ఎన్ని వందలైనా, వేలయి పోయడానికి సిద్ధపడ్డాం. ప్రాణంకన ఎక్కువ కాదుగదా బాబాయ్ డబ్బు" అని మళ్ళీ ఏడవసాగింది.

స్తంభీభూతుడై కూర్చున్న అన్నయ కొంచెం చలించాడు. "మాకు రావలసి రోగం వాడికి వచ్చి పొట్టనబెట్టుకుం చూడు" అన్నాడు.

"మన చేతుల్లో ఏముంది అన్నయ్యా" వ్యర్థ వేదాంతం వల్లించాను. ఆ సమయా కదే సమంజసంగా తోచింది నాకు.

"ఆ విషయం నాకూ తెలుసుగా ఇదంతా ఎవడి చేతుల్లోవుందో వాణ్ణే అడుగుతున్నాను ఎందుకిలా చేశావని అసలు వాడు మా కడుపున పుట్టకుండ వుంటే మాకీ బాధ ఉండేది కాదు కదా ముగ్గురు పిల్లల్ని కబళించిన మృత్యువు నన్ను మటుకు ఎందుకు వదలిపెట్టినట్టు ఇవన్నీ కళ్ళారా చూస్తూ, వాళ్ళ ఆయుషు కూడా నేనే పోసుకుని జీవచ్ఛవంలా బ్రతికివుండాలని ఆ దేవుడి సంకల్పం కాబోలు!" ఇన్ని మాటలు ఒక్కసారిగా మాట్లాడిన అన్నయ్య అలిసిపోయినట్టు గోడకు ఆనుకుని మౌనంగా కూర్చుండిపోయాడు.

"ఖర్మ అన్నయ్యా. అంతా మనఖర్మ! అనుభవించక తప్పదు. నువ్వు పెద్దవాడివి నీకు నేను చెప్పదగినవాణ్ణి కాదు గాని నువ్వుకాస్త మనసు చిక్కగట్టుకోకపోతే ఎలా చెప్పు? వదినకు ధైర్యం చెప్పే దెవరు? శకుంతలను ఊరడించే దెవరు? మగవాళ్ళం కనుక మనం ధైర్యం తెచ్చుకోవాలి."

నా మాటలు నాకే వెలితిగా తోచాయి.

"మా ఇంట్లో అందరికన్నా శంకరం మంచి తెలివైనవాడు, నెమ్మదస్తుడు కూడా. ఒక్కరోజయినా మాటకు మాట జవాబు చెప్పి ఎరుగడు. పరీక్షల్లో ఎప్పుడూ తప్పలేదు. వాడూ పోయాడు, ఆ నాలుగో రోజునే వాడి రిజల్ట్ తెలిసింది. పి. యు. సి. ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాడు కాని ఏం?... లాభం? అసలు మనిషే లేకపోయిన తరువాత ఏ క్లాసులో ప్యాసయితే ఏం?....వాళ్ళ కాలేజీలో కొంతమంది లెక్చరర్లకు ఈ విషయం తెలిసింది కాబోలు వాళ్ళందరూ కూడా ఎంతో విచారిస్తూ ఉత్తరాలు వ్రాశారు, శకుంతల భారమైన కంఠస్వరంతో చెప్పుకు పోతోంది." వాడి చేతిలో ఎప్పుడూ పుస్తకం వుండేది బాబాయ్. పి. యు. సి. కాగానే బి. ఇ. చదవాలని వాడికోరిక."

అన్నయ్య కల్పించుకుని "అవున్నా. వాడికి చదువుమీద చాలా శ్రద్ధ..." అని ఇంకా ఏమో చెప్పబోయాడుగాని అంతలో లోపలినుండి వదిన అందుకుంది. "అసలు వాడు బ్రతికుండి చదువుకుని వుంటే, బి. ఇ. కూడా ఫస్టుక్లాసులో ప్యాసయ్యేవాడు. మీ అన్నయ్య కూడా ఎంత ఖర్చయినా భరించి చదివించుండేవారు."

ఆ ఇంటి వాతావరణం కొద్దిగా మారి, మనుషుల నందడి మొదలవగానే నా మనసు కొంచం తేలికబడింది. మళ్ళీ సాయంకాలం బస్సుకి తిరుగు ప్రయాణం పెట్టుకున్నందువల్ల ఈలోగా ఆవూళ్లో వున్న మరో నలుగురు బంధువులనూ చూసి రావలసిన పని ఏర్పడింది. ఊళ్లో కెళ్ళిన తరువాత వాళ్ళనందర్నీ పలకరించి రాకపోతే ఏం బాగుంటుంది? మళ్ళీ మళ్ళీ అంతదూరం వెళ్లడం కుదురుతుందా ఏమన్నానా? ఎవరింట్లోనూ ఎక్కువసేపు కూర్చోకపోయినా ఊరికే వెళ్ళి మొహం చూపించి వచ్చేయాలి.

అసలు వాళ్ళెవర్నీ కలుసుకోగల మన స్థితిలో లేనుగాని మర్యాదకోసం వెళ్ళక తప్పదని ఆ కార్యక్రమం పెట్టుకున్నాను. అందరిళ్లూ ఒకసారి చుట్టబెట్టి చివరికి మళ్ళీ అన్నయ్య దగ్గరకు వెళ్ళి నాలుగు సాంత్వన వచనాలు చెప్పి ఊరికి బయలు దేర దలచుకున్నాను.

ఈమాటే అన్నయ్యతో చెప్పి. దగ్గరిలోనే వున్న మరొక పినతండ్రిగారింటికి వెళ్లాను. అక్కడ పినతండ్రి కొడుకు రామంలేడు. పొలానికి వెళ్ళాడని చెప్పింది అక్కడే కూర్చుని బియ్యం ఏరుకుంటూన్న పిన్ని.

నన్ను చూడగానే చేట పక్కకుపెట్టి లోపలికి ఆహ్వానించింది. నేను ఏదో ఒకటి మాట్లాడాలని ఏం చేస్తున్నారు పిన్నీ?" అని అడిగాను.

ఆ....ఏముందిలే! రోజూ చేసేవేగా? నా సంగతికేంగాని నువ్వేమిటిలా హఠాత్తుగా ఊడిపడ్డావ్?" అని అడిగింది ఏమీ ఎరగనట్టు.

"అన్నయ్యను చూసిపోదామని వచ్చాను పిన్నీ."

"ప్చ్ ...వాడికి పెద్ద కష్టమే వచ్చిపడిందిరా పాపం! చెట్టంత కొడుకూ చూస్తూండగానే పోయాడు." అని నిట్టూర్చింది పిన్ని.

"చాలా ఘోరం కదూ!"

"ఆ...కాదేమన్నా రోగం వచ్చి పోయాడా రొష్టువచ్చిపోయాడా? విషం మింగి చచ్చిపోయాడు."

అదిరిపోయాను. ఇదేమిటి ఈవిడిలా అంటోంది? అని కుతూహలంగా ఆమె

వైపు చూడసాగాను.

"వాడు వాంతి చేసికొన్నప్పుడు అందులో పచ్చ పచ్చగా, నల్ల నల్లగా ఏమో కనిపించింది. నేనప్పుడే అనుకున్నా వీడేదో మందు మింగాడని."

"అలా మందు మింగి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వాడికేమొచ్చింది పిన్నీ?"

ముక్కు చీదుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ చెప్పడం మొదలుపెట్టింది పిన్ని.

"అసలు వాడు పరీక్షలు వ్రాసినప్పటి నుంచీ ఇంట్లో గొడవలుగానే వున్నాయిలే. వాడేమో ఇంకా చదువుతాననీ తండ్రి వద్దనీ...."

"అన్నయ్య ఎందుకొద్దంటాడు?" అర్థంకాక ప్రశ్నించాను నేను.

"ఎందుకేమిటి? డబ్బు ఖర్చవుతుంది చొద్దూ? అంతడబ్బు నేనెక్కడ్నించి తేను అని రోజూ ఇంట్లో ఎగిరెగిరి పడేవాట్ట కేశవుడు."

'ఏం వాళ్ళదగ్గర ఆ మాత్రం డబ్బు లేదా?'

"లేకేం! తోలెడంత డబ్బుంది. కేశవుడికి ఎంత లేదన్నా ఇరవై వేల ఆదాయం వుంది. కాని పిల్లాడ్ని తన చేతి క్రింద ఉంచుకోవాలనే ఆశకొద్దీ చదివించనన్నాడు."

"మరి తండ్రితో పోట్లాడలేదూ..?"

"రోజూ అదే పని. వాళ్ళిద్దరికీ పదిహేను-ఇరవై రోజులు ఇద్దరూ వాదులాడుకున్నారు. తండ్రి తనపట్టు వదల్లేదు. కొడుకు తన అభిలాషను చంపుకోలేదు. చదివించకపోతే నేను ఇంట్లోంచి వెళ్ళిపోతానని బెదిరించాడట శంకరం. కేశవుడికి కూడా తిక్క పుట్టుకొచ్చి "ఎక్కడికి పోతావో పో! వల్లకాట్లోకి'' అని తిట్టాడట. శంకరం అన్నంత పనీ చేశాడు. వేరుగా వల్లకాట్లోకే వెళ్ళిపోయాడు. డబ్బుండీ చదివించడంలేదనే కచ్చతో విషం తిని చచ్చిపోయాడు పాపం!''

పిన్ని చెప్పిన సంగతులు కొత్తదిగా వుండి, నాలోని ఆవేదనను మరింత అధికం చేశాయి.

ఆవిడ ఇచ్చిన కాఫీ త్రాగిసెలవు తీసుకుని మరొక తమ్ముడివద్దకు వెళ్ళాను. అన్నదమ్ముల పిల్లలందరిలోకీ వీడొక్కడన్నే చదువుకొని హాయిగా ఉద్యోగం చేస్తూంటే! మిగతా అందరూ వ్యవసాయం చేసుకుంటూ పల్లెలోనే ఉండిపోయారు



నేను వెళ్ళేసరికి పొలంవైపు బయలుదేరుతున్నాడు కృష్ణుడు. నన్ను చూసి వెనక్కి తిరిగి ఇంట్లోకి నడిచాడు.

''ఎప్పుడొచ్చావన్నయ్యా....?''

'ఇవ్వాళే వచ్చాన్రా.'' అన్నాను. అతను చూపించిన కుర్చీలో కూర్చుంటూ.

''కేశవన్నయ్యను చూశావా?''

"ఆc! చూసే వచ్చా.''

''ఏమంటున్నాడు?'' వ్యంగ్యంగా వుందతని ప్రశ్న.

''ఏమంటాడు? పుట్టెడు దుఃఖంలో వున్న మనిషి ఏమనగలడు అసలు?'' నేను కాస్త కటువుగానే సమాధానం చెప్పాను. మాదాయాదుల్లో ఒకరిపొడ ఒకరికిగిట్టదని నాకు తెలుసు.

"అవున్లే పాపం ఏమంటాడు? తను చేసింది తనమీదికే వస్తుందని అతనేమన్నా కలగన్నాడా ఏమిటి?"

కృష్ణుడి వ్యంగ్యధోరణి అర్థంకాక అయోమయంగా చూశానతనివైపు.

''నువ్వెప్పుడైనా వాళ్ళ దేవుడిగది చూశావా?"

"ఇదివరకు చూశానుగాని ఈమధ్య చూడలేదు."


'వాళ్ళు కొత్తగా ఏదో దేవతను తెచ్చి ఇంట్లో పెట్టుకున్నారట. అప్పుడప్పుడు పూజారయ్యను పిలిపించి ఏవో మంత్రాలూ, తంత్రాలూ, పూజలూ చేయిస్తారట. ఈ నాలుగైదేళ్ళనుంచి వాళ్ళకేం తక్కువ లాభాలొచ్చాయనుకుంటున్నావా? ఊళ్ళో బాగా పండిన పొలాల్లోని పంటలన్నీ వాళ్ళ పంటల్లోకి వెళ్ళిపోతున్నాయి తెలుసా?"

''అదెలా సాధ్యం కృష్ణా?'' అతను చెపుతున్న మాటలు నమ్మశక్యం కావడం లేదు నాకు.

''దాన్నే 'చేతబడి' అంటారన్నయ్యా. క్షుద్రదేవతల్ని పూజించి, పూజారి చేత అలా చేయిస్తారు మనం మనసులో ఏదనుకుని చేస్తామో ఆ పని దానివల్ల జరిగితీరుతుంది. కేశవన్నయ్యా కూడా అలాగే చేశాడిన్ని రోజులు. కాని తను చేసింది తనకే ముప్పు తెచ్చిపెడుతుందని అనుకోలేదు పాపం....''

"నీ మాటలు నాకసలు అర్థం కావడం లేదు కృష్ణా. ఇదంతా నిజమేనంటావా?"

''నిజం కాకపోతే అబద్ధాలెందుకు చెబుతా అన్నయ్యా? వాడు చేస్తున్న అన్యాయం ఎన్నాళ్ళు భరిస్తారు జనం?




ఎవరో అతను చేసినదానికి తిరుగు చేయిచారు, అది కాస్తా ఇలా అలా జరికూర్చుంది."

అతని మాటలు వింటున్నకొద్దీ ఏద గందరగోళంలో పడ్డట్లయింది నా పని

'ఏమిటిది? పిన్ని ఒకరకంకా చెప్పింది వీడొక రకంగా చెబుతున్నాడు. వీటిల్లో ఏది నిజం? ఏది అబద్ధమయి వుంటుంది అని ఆలోచిస్తూ అక్కడినుంచి లేచాన ఇంకొక ఇంటికి వెళ్ళవలసి వుండటంచే కృష్ణుడికీ, ఇంట్లోవాళ్ళకీ చెప్పి బయలుదేరాను.

మరొక పినతండ్రి భార్య రుక్మిణిపిన్ని నేను వచ్చిన సంగతి తెలిసింది కాబోలు గుమ్మంలోనే ఎదురు చూస్తూ కూర్చుంనాకోసం.

నేను వెళ్ళగానే "రా నాయనా, రా అందరూ కులాసాయేనా!" అని ఆప్యాయంగా పలకరించింది.

"ఆఁ...అందరూ కులాసామే పిన్నీ! అంటూ చాపమీద చతికిల పడ్డాను.

"కేశవుణ్ని చూశావా!"

"ఆఁ...."

నాకెందుకో ఎక్కువ మాట్లాడాలనిపించడం లేదు. ఇహ ఇక్కడేమి వినవలసి వస్తుందోనన్ని లోలోన బాధిస్తూనే వుంది నన్ను.

కాసేపు మౌనం వహించిన పిన్ని హఠాత్తుగా ప్రశ్నించింది.

"చూశావా ఆడవాళ్ళెలావుంటారో?'

నాకావిడ మాటకు తలా తోకా అర్థం కాక "అంటె?" అని అడిగాను.

"అసలిదంతా ఆ శకుంతలే చేసిందిట్రా." ఏదో పెద్దరహస్యం చెబుతున్నట్టు నొక్కి చెప్పింది పిన్ని.

"శకుంతలా?" ఆశ్చర్యంగా నోరు తెరిచాను.

"ఆఁ, శకుంతలే. ఇంకా చెప్పాలంటె శంకరానికి అక్కయ్య. అర్థమయిందా?"

"అర్థమయిందిగాని అదేం చేసింది!"

"అదేం తక్కువ దనుకుంటున్నావా నువ్వు? ఇంట్లో మిగిలింది తనూ శంకరం ఇద్దరే. మధ్యలో వాళ్ళిద్దరూ ఎలాగా పోనేపోయారు. వీడుకూడా పోతె ఆస్తి అంతా తనకే దొరుకుతుందినే ఆశతో విషంపెట్టి చంపేసింది తెలుసా? ఇదంతా ఆ తల్లి-తండ్రుల కెలా తెలుస్తుంది పాపం? అసలు ఆడదాని మనసు తెలుసుకోవడానికి వంద జన్మలెత్తినా చాలదని పెద్దలననే అన్నారు కదా!"

ఛ... ఛ! శకుంతల అలాంటి పని చేయగలదా? నేను ముందు ఆమెతోనేగా మాట్లాడింది. ఆమె అంతటి ఘోరమైన పని చేస్తుందని కలలో కూడా ఊహించకూడదు అయినా ఆమె చేసిందని ఈవిడకెలా తెలుసు మరి ఒక్కొక్క రకంగా చెబుతున్నారేమిటి? ఒక్క సంఘటన జరిగేటప్పటికి నలుగురూ నాలుగు విధాలుగా వాఖ్యానం చేస్తున్నారే! వీటిల్లో ఏది నిజం. ఏది అబద్ధం? ఏమో నాకు అంతా అయోమయ మనిపించింది. అక్కడినుంచి ముందు లేచిపోవాలనిపించి, బస్సుకు వేళవుతోందనే మిష పెట్టి బయటికి జారుకున్నాన.

అందరినీ కలుసుకోవడం అయిపోయింది 'మళ్ళీ అన్నయ్య ఇంటికి వెళ్ళి రెండు నిముషాలు మాట్లాడి, బస్‌స్టాండుకు వెళ్ళిపోవాలి, లేకపోతె నాకు పిచ్చివచ్చే అవకాశముంది'అని ఆలోచిస్తూ వడివడిగా నడచి అన్నయ్య ఇంటికి చేరుకున్నాను.

అయిదు నిముషాలసేపు ఏవేవో మాట్లాడి చివరికి బయలుదేరే ముందు అన్నాను:

"జరగరాని ఘోరమే జరిగిపోయిందన్నయ్యా. కాని నువ్విలా ఊరికే దుఃఖిస్తూ కూర్చునేకంటె మనసు దేనిలోనైనా మగ్నం చేసుకోవడం మంచిది.'

"ఏం చేయమంటావు?"

"ఇంట్లోనే కూర్చునే బదులు కాస్త పొలంవైపు వెళ్ళి పనులు చూసుకో."

"పొలంలో ఏముందని వెళ్లను?"

"అంటె?"

"ఈ ఏడు విత్తనాలు జల్లనే లేదుగా!"

"ఎవరికైనా కౌలుకిచ్చావేమిటి?"

"కౌలుకూ ఇవ్వలేదు, నేనూ చేయలేదు. పొలమంతా బీడుగా వదిలేశాను."

"ఎందుకలా చేశావన్నయ్యా? ఈ ఏడు పంటలెలా వస్తాయి మరి?"

'పంట లెవడికోసం ఇప్పుడు? పొలం యజమానే లేకుండా పోయాక ఎవరికోసం పండించాలి?" నిర్లిప్తంగా సమాధానం చెప్పాడు అన్నయ్య.

ఏం మాట్లాడాలో తోచలేదు నాకు. మౌనంగా నిలబడిపోయాను.

'అన్నయ్య దుఃఖాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. అందులో పాలు పంచుకోవడానికి కూడా ఎవరూ సిద్ధంగా లేరు' అనుకుంటూ బస్‌స్టాండు వైపు నడిచాను. *

జ్యోతి